'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## కాళేశ్వరంపై కక్ష - రైతులకు శిక్ష

**కల్లబొల్లి** హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు కక్షసాధింపు కాళేశ్వరం ప్రాజెక్టు పాలిట శాపంగా మారుతున్నది. చిన్న ప్రమాదాన్ని భూతద్దంలో చూపి మొత్తం ప్రాజెక్టే దండగ అన్నట్టు చెప్పే ధోరణి దీని వెనుక ఉన్నది. ఇందులో గల్లీలోని ఛోటేభాయ్, ఢిల్లీలోని బడేభాయ్ దొందూదొందే అన్నట్టుగా వ్యవహరిస్తుండటం తెలిసిపోతూనే ఉన్నది. ఈ సూత్రధారులు ఆడిస్తున్న నాటకంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) కేవలం ఓ పాత్రధారి మాత్రమే. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు కనుసన్నల్లో పనిచేసే ఎన్డీఎస్ఏ వండివార్చిన అతుకుల బొంత నివేదికపై కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా కాంగ్రెస్ సర్కారు పెద్దలు గంతులు వేయడం ఈ మిలాఖతు రాజకీయాలకు పరాకాష్ఠ.

ప్రాజెక్టును సకాలంలో బాగుపర్చి సాగుకు అండగా నిలపడం కన్నా బీఆర్ఎస్‌పై బురదజల్లడం మీదనే వారికి ఆసక్తి ఎక్కువగా ఉన్నట్టు తేటతెల్లమైపోతున్నది. తుదినివేదిక వెలుగు చూసిన సమయం, సందర్భమే దీనిని పట్టిస్తున్నది. అసలు ఎన్డీఎస్ఏ శల్యపరీక్ష మొదటి నుంచీ రాజకీయ కోణంలోనే సాగుతున్నది. కాళేశ్వరంలోని మూడు బరాజ్‌లలో ఒకటైన మేడిగడ్డలో 89 పియర్స్ ఉంటే అందులో కేవలం 2 పియర్స్ మాత్రమే కుంగిపోయాయి. భారీ ప్రాజెక్టుల్లో ఇలాంటివి జరగడం అత్యంత సహజమని నీటిపారుదల రంగం గురించిన కనీస అవగాహన ఉన్నవారెవరికైనా అర్థమవుతుంది. ప్రపంచ బ్యారేజీల, ఆనకట్టల చరిత్రే ఇందుకు సాక్ష్యం. ఏ ప్రాజెక్టుకైనా తొలినాళ్లల్లో చిన్నచిన్న ఇబ్బందులు రావడం, వాటికి మరమ్మతులు చేసుకుని ముందుకు సాగడం అనేవి తప్పవు. కానీ పియర్స్ కుంగింది అసెంబ్లీ ఎన్నికల సమయంలో కావడంతోనే చిక్కొచ్చింది. కాంగ్రెస్, బీజేపీ గాయిగాయి చేశాయి. ఎన్డీఎస్ఏ ఆగమేఘాల మీద కదలివచ్చింది. గంటల వ్యవధిలో, అదీ పియర్ దగ్గరకు వెళ్లి కనీసం పరిశీలన అయినా చేయకుండానే ప్రాథమిక నివేదిక ఇవ్వడం, దానిని పట్టుకుని కాంగ్రెస్ , బీజేపీలు ఊరేగడం, బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద జల్లడం చకచకా జరిగిపోయాయి.

అసలు నివేదికే ఇస్తుందో, లేదో తెలియని సందిగ్ధం ఏర్పడింది. మధ్యలో సరిగ్గా పార్లమెంటు ఎన్నికల సమయంలో మధ్యంతర నివేదిక వచ్చింది. ఇప్పుడు ఘటన జరిగిన ఏడాదిన్నర తర్వాత ఆకాశం నుంచి ఊడిపడ్డట్టుగా తుది నివేదిక ఇవ్వడం, అందులో ఉన్నవీ, లేనివీ కల్పించి చెప్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మీడియాకు ఎక్కడం చూస్తుంటే ఇదంతా రాజకీయ ప్రేరేపితం కాకపోతే మరేమిటి అనిపించక మానదు. కేంద్ర పర్యవేక్షణలో కడుతున్న పోలవరం కూలి ఐదేండ్లయినా ఇంతవరకు ఆవైపు తొంగి చూడని ఎన్డీఎస్ఏ ఇక్కడ పైపై పరిశీలనలతో నివేదిక ఇవ్వడమేమిటి? ఇంతకూ ఏమి తేల్చింది? ఏడో బ్లాకును పునరుద్ధరించిన ప్రాజెక్టును యథాతథంగా ఉపయోగించుకోవచ్చని ఒకచోట, ఇలాంటి సమస్యలే మిగతా బరాజ్‌లలో ఉండవచ్చును కనుక పరీక్షలు జరపాలని మరో చోటా ఆకుకు అందకుండా, పోకకు పొందకుండా సెలవిచ్చింది. అది పట్టుకుని సర్కారు కోడిగుడ్డుపై ఈకలు పీకే పనికి పాల్పడుతున్నది. నివేదికలో ప్రస్తావించని అవినీతి అంశంపై మాట్లాడటం కుట్రబుద్ధే. ఈ మొత్తం వ్యవహారంలో కాళేశ్వరాన్ని అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్‌పై బురద జల్లడం అన్నదే ఏకైక లక్ష్యంగా కనపడుతున్నది. ఈ రాజకీయ కక్షసాధింపు పేరిట రైతాంగాన్ని సమస్యల పాలు చేయడం ఏమాత్రం క్షంతవ్యం కాదు.

# ఆత్మగౌరవం అందరికీ ఉంటుంది!

నాలుగు దశాబ్దాల కింద ఎన్టీఆర్ తెలుగు వాడి ఆత్మగౌరవం గురించి ఎలుగెత్తి చాటారు. అందరూ భేష్ అన్నారు. అన్నకు అధికారం కట్టబెట్టారు. గతాన్ని వర్తమానంలో ఇప్పటికీ కొందరు గుర్తుచేస్తూ ఉంటారు. ఈ విషయంలో తొలి స్థానంలో మీడియా ఉంటుంది. కొన్ని టీవీలు, పత్రికలు సమయం చిక్కిన ప్రతీ సందర్భంలో ఆత్మగౌరవం గురించి చాలా లోతుగా విశ్లేషణ చేస్తాయి. ఇంకా టీడీపీ విషయంలో ఆ పార్టీ కార్యక్రమాల విషయంలో తెలుగు వారికి అది చేసిన మేలు గురించి గొంతు చించుకొని దిక్కులు పిక్కటిల్లేలా చెప్తున్నాయి కొన్ని మీడియా సంస్థలు. కానీ, ఎందుకో తెలంగాణ విషయంలో దానికి భిన్నంగా వ్యవహరిస్తాయి.



**అస్కాని మారుతీ సాగర్**
9010756666



తెలుగు వాడి ఆత్మగౌరవంలో తెలంగాణకు స్థానం లేదా? అస్సలు ఆ విషయం గురించి సోయి ఎందుకు ఉండటం లేదు? అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా అంతే. ఈ భిన్న ధోరణి ఎందువల్ల వచ్చింది? వీటికి గల కారణాలేమిటనే విషయాలను లోతుగా చర్చించాలి. తరచిచూడాలి. ఈ విషయం గురించి విశ్లేషణ ఇప్పుడే ఎందుకు చేయాలి? అనే సందేహం సహజంగానే వస్తుంది. దానికి కారణం లేకపోలేదు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ, సందర్భాలే దీనికి నేపథ్యం.

తెలుగు నేలపై బీఆర్ఎస్ (టీఆర్ఎస్) సరికొత్త చరిత్రను రికార్డు చేసింది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ స్థానం ప్రత్యేకమైనది. ఉద్యమ పార్టీ ఆవిర్భవించిన అనంతరం ఎందరినో భాగస్వామ్యులను చేసి అసాధ్యమనుకున్న స్వరాష్ట్ర కాంక్షను సుసాధ్యం చేసి స్వయం పాలనను సాధించింది, చూపించింది. తెలంగాణ ఇప్పట్లో తేలేదీ కాదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాదనుకున్న వాళ్ల అనుమానాలు పటాపంచలు చేసింది. దశాబ్దాల కలను నిజం చేసింది. అంతే కాదు, తెలంగాణ ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పునకు పునాదులు వేసింది. అలాంటి పార్టీ 24 వసంతాలు పూర్తిచేసుకొని 25వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా రజతోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో మీడియా ఏం చేసింది? ఈ పార్టీ గురించి, ఈ పార్టీ చారిత్రకాంశాల గురించిన చర్చోపచర్చలు టీవీల్లో ఎందుకు లేవు? పత్రికల్లో మూడురోజుల పాటు ఓ పేజీ కేటాయించి అచ్చేసిన పరిస్థితి తెలుగు ప్రధాన స్రవంతి పత్రికల్లో ఎందుకు రాలేదు? యూట్యూబ్‌లలో పచ్చళ్ల పంచాయితీల గురించి, ఏపీలో జరుగుతున్న గ్రామ పంచాయితీ స్వల్ప ఘర్షణలకు ఇచ్చిన ప్రాధాన్యం తెలంగాణ రాజకీయ పార్టీకి ఎందుకివ్వలేదు? ఇవ్వడానికి వారికి మనస్సు ఎందుకు అంగీకరించలేదు? ప్రస్తుతం ఈ ప్రశ్నలు తెలంగాణ సమాజంలో తలెత్తుతున్నాయి.

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి అస్సలు విలువే లేదని కొన్ని మీడియా సంస్థల వాళ్లు భావించినట్టున్నారు. తెలంగాణ అంటే తమ దృష్టిలో వలస ప్రాంతం అనే భావనలో నుంచి ఇంకా వారు బయటకు రానట్టే ఉన్నారు. హైదరాబాద్ కేంద్రంగానే ప్రధాన స్రవంతి మీడియా నడుస్తున్నది. సీమాంధ్రకు సంబంధించిన మీడియా హడావుడే ఇప్పటికీ ఎక్కువగా ఉంటుంది. సదరు మీడియా సంస్థలకు, బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి పెద్ద దూరం కూడా ఏమీ లేదు. అయినా, ఈ ప్రాంతంలో జరుగుతున్న రజతోత్సవ వేడుకల హడావుడి గురించిన అలికిడి వీళ్ల చెవులకు విన్పించినట్టు లేదు. వినాలని కూడా వారు అనుకున్నట్టు లేదు.

> తెలుగు వారందరూ ఒక్కటే అనుకున్నప్పుడు, తెలంగాణ ప్రజలంతా సమానంగా ఎదగాలని కోరుకున్నప్పుడు తెలంగాణ అస్తిత్వపు నమూనా అయినా బీఆర్ఎస్ గురించి, చరిత్రలో అది పోషించిన పాత్ర గురించిన చర్చలు టీవీల్లో ఎందుకు రాలేదు. పత్రికల్లో ఆయా రంగాల నిపుణుల చేత వ్యాసాలు ఎందుకు రాయించలేదు. అంటే తాము పట్టించుకోదలచుకోలేదు. తమకు సంబంధించిన అంశం కాదనే ధోరణి వారిదనే ఆరోపణలు తెలంగాణ సమాజం నుంచి వ్యక్తమవుతున్నాయి.

వాస్తవానికి టీఆర్ఎస్ పద్నాలుగేండ్లకుపైగా ఉద్యమించింది. పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పాలించింది. ఉద్యమ ట్యాగ్‌లైన్ అయిన నీళ్లు, నిధులు, నియామకాలను పరిపూర్తి చేయడంలో సఫలమైంది. తెలంగాణ ప్రజలూ పాలించుకోగలరని నిరూపించింది. అంతే కాదు, పంజాబ్‌తో పోటీ పడి ధాన్యం ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు తయారుచేసి, అమలుచేసింది. దేశంలోనే అతి తక్కువకాలంలో తలసరి ఆదాయం పెంచుకున్న రాష్ట్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రజల జీవన ప్రమాణాలు పెంచింది. హైదరాబాద్ నగర ఖ్యాతిని ఇనుమడించింది. దేశానికే సరికొత్త దారి చూపించింది. యావత్ దేశ ప్రజలకు ఉపాధి కేంద్రంగా తెలంగాణను తయారుచేసింది. ఇన్ని సానుకూలంశాలున్న పార్టీ గురించి చర్చించాలనే, ప్రచురించాలనే విషయాన్ని తెలుగు ప్రధాన స్రవంతి మీడియా పట్టించుకోలేదనే విమర్శలు ఎందుకు వస్తున్నాయి.

ఏపీలో జరిగిన రాజకీయ పరిణామాల గురించి గ్రామీణ తెలంగాణ ప్రజలు సైతం తెలుసుకునేలా వార్తలు ముద్రిస్తారు. టీవీల్లో చూపిస్తారు. ఇది చాలదన్నట్టు టీవీల్లో చర్చలు పెట్టేస్తారు. గంటల కొద్ది సమయం వాటికి కేటాయిస్తారు. అదీ కాకపోతే సినిమా రంగంలోని రంగులను, హంగులను ప్రజల ముంగిట్లోకి తెచ్చి.. వినోదం కుమ్మరిస్తున్నామని చెప్పుకొంటారు. అంతా ఒక్కటే.. అందరం ఒక్కటే అనే ట్యాగ్‌లైన్లు తగిలిస్తారు. కానీ, తెలంగాణ రాజకీయ పార్టీ గురించిన పట్టింపును విస్మరిస్తారు. ఈ విషయాలన్నీ తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. రాష్ట్రాలు రెండైనా ఒక్కటే అనుకుంటున్నారు తెలంగాణ ప్రజలు. ఇంకా చెప్పాలంటే.. తెలుగు జాతి మనది, రెండుగ వెలుగు జాతి మనదని తెలంగాణ ప్రజల భావన ఇది. తెలుగు సమాజాన్ని ప్రభావితం చేసిన, చేస్తున్న పార్టీల గురించిన విషయాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చెప్పాలి, చూపించాలి. అప్పుడే, తెలుగు వారి మధ్య మరింత ఐక్యత, సఖ్యత పరిఢవిల్లుతుంది.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

# అవినీతి, ఆశ్రిత పక్షపాతం

ఒక సుసంపన్నమైన భాషలో అన్ని పరిస్థితులకు తగ్గట్టు సామెతలుంటాయి. వాటిని అర్థం చేసుకొని ఆచరిస్తే మనుష్యులు తక్కువ బాధలు పడుతారు. ప్రస్తుతం కేంద్రంలో, తెలుగు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీల విషయాలు చూద్దాం!



**కనకదుర్గ దంటు**
89772 43484



దీర్ఘకాలం కేంద్రం, చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అవినీతి పాలనకు విసిగి వేసారిన ప్రజలు మతతత్వ పార్టీ బీజేపీకి ఓటు వేశారు. దురదృష్టమేమంటే చదువుకున్నవారూ ఈ మతమౌఢ్యంలో కొట్టుకుపోయారు! ఇక మొదలైంది దేశ దీనత్వం. నిజానికి వాజపేయి వ్యక్తిత్వం చూసి బీజేపీకి 2014లో ఓట్లు కట్టబెట్టారు ప్రజలు. 1996లో ప్రజామోదంతో ప్రధాని అయిన వాజపేయి 13 రోజుల తర్వాత జయలలిత మద్దతు ఉపసంహరించటంతో పదవిని వదిలేశారు. ఒక ఎంపీని కొంటే ఆయన పదవి నిలిచేది. కానీ, అత్యుత్తమ వ్యక్తిత్వం కలిగిన రాజకీయవేత్త వాజపేయి, తన పార్టీ సలహా తీసుకోలేదు. తర్వాత 1998-2004 దాకా ప్రధానిగా పనిచేసిన ఆయన దేశ ప్రజల పట్ల ప్రేమ, దీనుల పట్ల కరుణ చూపటమే కాకుండా, విదేశాలతోనూ స్నేహం చేశారు. భారత్‌పై శతృత్వం చూపిన పాక్ వంటి దేశాలతో స్నేహంగానే ఉండి వారిని నియంత్రించారు. నెహ్రూ 17 ఏండ్ల అప్రతిహత పాలన కంటే వాజపేయి ఐదేండ్ల పాలన బాగుంది! ఎందుకంటే కొన్ని విషయాల్లో నెహ్రూ పాలనాచక్రాన్ని రివర్స్ గేర్‌లో నడిపాడు. దేశంలో సరైన విద్యావిధానం రూపొందించటంలో ఆయన విఫలమవటమే కాకుండా, అందరికీ విద్య అవసరమని గుర్తించలేదు. పిల్లలకు 10 గానీ 12 తరగతి వరకు తప్పనిసరి విద్యావిధానాన్ని అమలుచేసి సరిపోయినన్ని ప్రభుత్వ పాఠశాలలు తెరవాల్సిందిపోయి, దేశంలో ఐఐటీలు, వర్సిటీలు స్థాపించాడు. వాటివల్ల ధనిక వర్గాల పిల్లలు లాభపడ్డారు. కానీ, అట్టడుగు వర్గాల పిల్లలు నష్టపోయారు. విద్యా విధానం విఫలం కావడం వల్ల ఆ వివక్ష, వ్యత్యాసాలు ఇప్పటిదాకా కొనసాగుతున్నాయి. అమెరికాతో ప్రజాస్వామ్యం అని పోల్చుకొని పెద్ద కబుర్లు చెప్తారే కానీ, ప్రజా సంస్కృతిలో ఆ దేశంతో భారతదేశాన్ని ఏ విధంగానూ పోల్చుకోలేం. నెహ్రూ రెండో వైఫల్యం జనాభాను నియంత్రించకపోవటం. స్వాతంత్ర్య సమయానికి దేశంలో 30 కోట్లు ఉన్న జనాభా కేవలం 20 ఏండ్లలో 60 కోట్లకు పెరిగింది. నెహ్రూ పుణ్యామాని నైపుణ్యాలు, ఉన్నత విద్య పొందిన ధనిక వర్గాల పిల్ల లు అమెరికా వెళ్లి ఆ దేశాన్ని బాగుచేశారు, నెహ్రూ ఆ దేశానికి జాతిపిత అయ్యారు. భారతదేశంలో నిరక్షరాస్యులు, నిమ్నవర్గాలు కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకులయ్యారు.


జనాభా నియంత్రణ, విద్యా విధాన వైఫల్యానికి తోడు, వరసగా గెలిచిన కాంగ్రెస్ అవినీతి పెచ్చు పెరిగి దేశం అధోగతి పాలైంది. ఇక ఈ కారణాలు చూపించి, నిర్భయ ఉదంతం లాంటి అత్యాచార సంఘటనలు ఉటంకించి, తమ ప్రచార హోరుతోనూ బీజేపీ అధికారంలోకి వచ్చింది. దుంగ వదలి మొద్దు ఎత్తుకున్నట్టయ్యింది దేశ ప్రజల పరిస్థితి. కాంగ్రెస్ తన అవినీతిలో మునిగి విద్యారంగం లాంటివాటిలో పెద్దగా జోక్యం చేసుకోలేదు. పైగా వారి మంత్రి మండలిలో ఆ తరంలో బాగా చదువుకున్నవారు కేంద్రంలో మంత్రి పదవుల్లో ఉండటంతో విద్యారంగంలో అధికారులు స్వతంత్రంగా వ్యవహరించి దేశంలోని కొన్ని విద్యాసంస్థలకు ప్రపంచస్థాయి ర్యాంకులు వచ్చాయి. అప్పుడు కొన్ని ఐఐటీలు, బెంగళూరులోని ఐఐఎస్సీ లాంటి సంస్థలకు 100 లోపు ర్యాంకులు కూడా వచ్చేవి. కేవలం హిందుత్వ లాంటి మూఢత్వం ఉన్న బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక అవే సంస్థలు 800 పైచిలుకు ర్యాంకులలోకి వెళ్లిపోయాయి.

విద్యారంగమే కాదు, ప్రధాని వివక్షాపూరిత పాలన మత వివక్షతో పాటు, వర్గ వివక్ష పెంపొందించింది. మతతత్వం ఎంత నెత్తికెక్కిందంటే మణిపూర్‌లో రెండేండ్ల నుంచి విభేదాలు, విధ్వంసాలు, అత్యాచారాలు జరుగుతున్నా, నోరు మెదపని, బాధితుల దగ్గరికి వెళ్లి పలకరించని వ్యక్తిని మూడోసారి ప్రధాని పదవిలో నిలబెట్టారు భారత ఓటర్లు. 99 శాతం దేశ సంపద 0.1 శాతం మంది వ్యాపారస్థుల చేతిలోకి వెళ్లిపోయింది. దేశ జనా భా 2023 లెక్కల ప్రకారం 143.81 కోట్లు. వీరి లో దేశ సంపద 99 శాతం 85,698 మంది అప ర కుబేరుల చేతుల్లోకి వెళ్లిపోయింది.

> తెలంగాణ సీఎంగా కేసీఆర్ రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయా న్ని రెండు రెట్లు తన రెండు టర్మ్‌ల్లో పెంచితే, ప్రధాని మోదీ సామాన్య జనాల తలసరి ఆదాయాన్ని తన రెండు టర్మ్‌ల్లో 25 శాతం తగ్గించారు.

అంతేకాదు, జనాల పొదుపు కార్యక్రమా లు 30 శాతం వరకు తగ్గాయి. ధరల పెంపుదల, అత్యాచారాలు హెచ్చడం, సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. నేరస్థులు బీజేపీ వారైతే శిక్షలు పడవు. పైన చెప్పిన సమస్యలకు తోడు ఇంకొక పెద్ద సమస్య దక్షిణ భారత దేశం ఎదుర్కొంటున్నది. రాష్ట్రాల మధ్య వివక్ష చూపడమే కాదు, ప్రాంతాల మధ్య కూడా వివక్ష మొదలైంది. ఇది తమ పార్టీ పాలించే రాష్ట్రాల పట్ల మొగ్గుచూపి, విపక్ష పార్టీ పాలించే రాష్ట్రాలని అణగదొక్కిన బీజేపీ ఇప్పుడు సగం దేశాన్ని తమ గుప్పిటలో పెట్టుకొని, వారికి ఏ విధమైన హక్కు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నది. తాజాగా జనాభా లెక్కల ప్రాతిపదిక మీద చట్టసభల్లో ప్రతినిధుల సంఖ్య ఉండాలని 'డీ లిమిటేషన్' చట్టం రుద్దటానికి ప్రయత్నిస్తున్నాడు ప్రధాని మోదీ. నిజానికి ఉత్తర భారతదేశ రాజకీయ నాయకులకు దక్షిణ రాష్ట్రాల గురించి అవగాహన శూన్యం. ఒక ఉదాహరణ చూద్దాం! మోదీ హైదరాబాద్‌లో చేసిన ప్రసంగంలో ఈ రెండు రాష్ట్రాల విభజనను 'తల్లిని చంపి, పిల్లను రక్షించారని' వర్ణించారు. అది బాధ్యతారాహిత్య అభిప్రాయమే కాకుండా, అవగాహనారాహిత్య ప్రకటన కూడా. ఎందుకంటే రాష్ట్రాలు కలిసినప్పుడు తెలంగాణకు రూ.67 కోట్ల సర్‌ప్లస్ నిధులు ఉంటే, ఆంధ్ర రాష్ట్రం రూ.12 కోట్ల అప్పుల్లో ఉన్నది. పైగా ఈ 58 ఏళ్ల ఉమ్మడి రాష్ట్రంలో నిజాంలు కల్పించిన వసతులు మాయమైపోగా, ఆంధ్ర రాజకీయ నాయకులు తెలంగాణ సంపద పోగేసుకున్నారు. ఎవరు తల్లి, ఎవరు పిల్ల మీరే అర్థం చేసుకోండి. చంపింది తెలంగాణను, లాభపడిం ది ఆంధ్ర రాజకీయ నాయకులు.

డీ లిమిటేషన్ అమలు చేయాలంటే ఒక్కటే నిబంధన పెట్టాలి దక్షిణ రాష్ట్రాలు, దేశంలో రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తిని పూర్తిగా కల్పించి, అమెరికా రాష్ట్రాల వలె, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం రాజ్యాంగం ఏర్పర్చుకొని, ఏ రాష్ట్ర వనరులు, ఆదాయం ఆ రాష్ట్రమే అనుభవించేటట్టు, కేవలం 10 శాతం ఆదాయాన్ని కేంద్రానికి ఇచ్చేటట్టు మార్పులు చేయాలి, అందరూ అంగీకరిస్తారా?




# పీవోకే భారత్‌దే



కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను భారత ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకోవాలి. ఉగ్రవాదులను శిక్షించాలన్నా, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలన్నా... అన్ని సమస్యలకు ఇదొక్కటే పరిష్కారం. ఎప్పటికైనా పీవోకే భారత్‌దే. ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడులకు ప్రతీకారంగా భారత్ కఠినంగా జవాబివ్వాలి.

**- లార్డ్ మేఘనాథ్ దేశాయ్,** భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ



# నీళ్ల నిలుపుదల ఎంత సాధ్యం?

> కశ్మీర్‌లోని పహెల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత మత ఉగ్రవాదులు 27 మంది అమాయక పర్యాటకులను కాల్చి చంపడంపై మన దేశం తీవ్రంగా స్పందించింది. మత ఉగ్రవాదులు జరిపిన దారుణ మారణహోమంపై దేశమంతా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

అరువై ఏండ్ల కిందట కుదుర్చుకున్న సింధు నదీజలాల పంపిణీ ఒప్పందాన్ని నిలిపి వేయాలని నరేంద్ర మోదీ నాయ కత్వంలోని భారత ప్రభుత్వం నిర్ణయించడం పాక్‌లో కలకలం రేపింది. ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960వ దశకం ఆరంభంలో సింధు నదీజలాల పంపిణీ ఒప్పందం కుదరింది. ఈ ఒప్పందం ప్రకారం పశ్చిమ వాహినులైన సింధు, జీలం, చీనాబ్ నదుల జలాలను పాకిస్థాన్‌కు, తూర్పు దిశగా ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదీజలాలను భారత్‌కు ప్రత్యేకించారు.

గత అరువై ఏండ్ల కాలంలో భారత్, పాకిస్థాన్ మధ్య 1965, 1971 కార్గిల్ వంటి ఎన్నో యుద్ధాలు జరిగినా, ముంబై తాజ్ హోటల్‌పై ఉగ్రవాదులు దారుణ మారణహోమం జరిపి ఎందరో అమాయకులను కాల్చి చంపినా, పాక్ గూఢచారి సంస్థలతో లష్కరే తోయిబా వంటి మతోన్మాద ఉగ్రవాదులు తెగబడి ఎన్నో హింసాత్మక విధ్వంసక దాడులు జరిపినా, సింధు జలాల ఒప్పందం చెక్కు చెదరలేదు. అయితే పాక్ ప్రేరణతో పహెల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణకాండతో దేశమంతా ఆగ్రహావేశాలు పెల్లుబుకు తున్నాయి. అందుకే ఉగ్రవాద హింసాకాండపై దృఢమైన వైఖరిని భారత ప్రభుత్వం వ్యక్తం చేసింది. కొత్త ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయ సిబ్బందిని సగానికి సగం తగ్గించింది. సైనిక సల హాదారులను, భారత్‌లో ఉన్న పాక్ పౌరులను వెంటనే దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. సరిహద్దుల్లో భారత సైన్యాన్ని సర్వ సన్నద్ధంగా ఉంచింది.

> దేశంలోని కీలక ప్రాంతాల్లో నిఘా పెంచింది. సింధు పరీవాహక ప్రాంతం నుంచి లభించే జలాలు పాక్ 'జీవ నాడి' వంటివి. అందుకే తీవ్రవాదం పెరిగిపోతున్న పాక్‌ను కట్టడి చేసేందుకు పాక్ ఆర్థిక మూలాలను దెబ్బతీసే వ్యూహాన్ని అమలు చేసి గుణపాఠం నేర్పాలని ప్రయత్నిస్తున్నది.

పాకిస్థాన్ నీటి అవసరాల్లో 76 శాతం సింధు, బియాస్, సట్లెజ్ జలాల ద్వారానే తీరుతున్నాయి. 80 శాతం భూములకు ఈ నదులు జీవ జలాలను అందిస్తున్నాయి. పాక్‌లో 90 శాతం ఆహారోత్పత్తి సింధు నదీజలాల ద్వారానే జరుగుతున్నది. కేవలం 244 మి.మీ. వార్షిక వర్షపాతం గల పాకిస్థాన్‌కు సింధు నదీజలాల ద్వారానే తాగునీరు లభిస్తున్నది. పాకిస్థాన్‌లో దాదాపు 40 శాతం శ్రామికులకు ఈ నదీజలాల ద్వారానే ఉపాధి లభిస్తున్నది. పాక్ జాతీయోత్పత్తి జీడీపీలో 24 శాతం సింధు నదీజలాల ఆధారంగా జరిగే ఉత్పత్తి ద్వారానే వస్తున్నది. టర్బేలా, మంగళ వంటి భారీ జలాశయాలు సింధు జలాల ద్వారా నిండుతున్నాయి. సింధు నది కాలువల వ్యవస్థ పాక్‌కు అత్యంత కీలకం. నీటి కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం అధిక నీరు అవసరమయ్యే వరి, గోధుమ వంటి ఆహార పంటలు, పత్తి వంటి వాణిజ్య పంటల సాగువల్ల తరచూ నీటి కొరత ఏర్పడుతున్నది. తీవ్ర నీటి కొరత గల దేశాల్లో పాక్‌ది మూడవ స్థానం అని ఆ సర్వేలో తేలింది. వాతావరణ మార్పుల వల్ల హిమ ఖండాలు కరిగి తొలుత నీటి లభ్యత పెరిగినా తదుపరి కొరత తప్పదు. ఈ పరిస్థితుల్లో సింధు నదీజలాల ఒప్పందాన్ని నిలిపివేయడం వల్ల పాక్‌కు 70 శాతం నీటి సరఫరా తగ్గి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతాయని నిపుణుల అంచనా.

పంజాబ్, సింధు వంటి సస్య శ్యామల రాష్ట్రాలు మరుభూములుగా మారవచ్చు. సింధు నదీ పంట కాలువలకు నీటి సరఫరా నిలిచిపోతే పాక్‌లో ఆహారోత్పత్తి పడిపోయి ధరలు, దారిద్ర్యం పెరిగి ఆకలితో అలమటించే దుస్థితి ఏర్పడవచ్చు. పాక్ జనాభాలో 80 శాతం గ్రామీణ ప్రజలు. వారి జీవనోపాధి వ్యవసాయమే. సింధు జలాలు నిలిపివేస్తే వారు ఉపాధి కోసం లాహోర్, కరాచి, పెషావర్, రావల్పిండి వంటి పట్టణాలకు వలస పోవలసి ఉంటుంది. ఇప్పటికే నీరు, విద్యుత్తు, రహదారులు ఇలా కొరతతో సతమతమవుతున్న ఆ నగరాల ప్రజావసరాలు మరింత దుర్భరంగా మారవచ్చు. సింధు నదీజలాల ద్వారా జరిగే 30 శాతం జలవిద్యుత్తు ఉత్పత్తి బాగా పడిపోయి పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు మూసివేస్తే నిరుద్యోగం మరింత పెరిగే అవకాశమున్నది.

> ఒక్కసారిగా సింధు జలాలను ఆపివేస్తే ఆ నీటి నిల్వకు అనువైన జలాశయాలు భారత్‌లో లేవు. వానకాలంలో అదనంగా వచ్చే నీటిని నిల్వ చేయడం కష్టం. పడమటి దిశగా వెళ్లే జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లించాలంటే ఇంజినీరింగ్ నైపుణ్యాలే గాక సమయం అవసరం. భాక్రానంగల్ తదితర డ్యాంలు తూర్పు దిశగా పారే నీటి నిల్వకే సరిపోతాయి. పల్లపు ప్రాంతాలు ముఖ్యంగా కశ్మీర్‌లో ఎక్కువ భాగం ముంపునకు గురవుతాయి. పాక్‌లో కూడా అత్యవసర పరిస్థితి రావచ్చు.

రక్తపుటేరులు, నీరు ఏకకాలంలో ప్రవహించే వీల్లేదని ప్రధాని మోదీ పాక్ నేతలకు గట్టి హెచ్చరిక చేసినా ఫలితం లేకపోయింది. అందుకే సింధు జలాల నిలుపుదల ముందుకు తెచ్చారు. ఉగ్రవాదాన్ని నిరోధించకపోతే సింధు జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా హెచ్చ రించారు. ఇదే జరిగితే పాక్ పొరుగు దేశంగా ఉన్న చైనా సింధు నదికి ఎగువన డ్యామ్‌లు నిర్మించి భారత్‌ను కట్టడిచేసేందుకు ప్రయత్నించవచ్చు. సింధు జలాలను నిరోధిస్తే పాక్‌కు భారీగా నీటి కొరత ఏర్పడవచ్చు. పాకిస్థాన్ ఇప్పటికైనా మత చాందసవాదులను పైకి ఎగదోసి, మత మారణకాండను ప్రేరేపించే దుశ్చర్యలకు స్వస్తి చెప్పి వాస్తవ దృష్టితో వ్యవహరించి ప్రజలకు అన్నవస్త్రాలు అందించి, అభివృద్ధి పథంలో పయనిస్తేనే ఉపఖండంలో సుహృద్భావం, శాంతి సాధ్యమవుతుంది.



**పతకమూరు దామోదర్ ప్రసాద్**
94409 90381

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)